క్లుప్తంగా

అమర వీరునికి నివాళి



ఆర్కే రోజా

నగరి : జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందిన బంగారుపాళెం మండలం ఎగువరాగిమాను పెంట గ్రామానికి చెందిన కార్తీక్‌కు మాజీ మంత్రి వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌కే రోజా నివాళులర్పించారు. జవాను మృతిపై మంగళవారం ఎక్స్‌ వేదికగా ఆమె స్పందించారు. దేశభద్రత కోసం జవాను వీర మరణం పొందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కార్తీక్‌ కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానని చెప్పారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సిమెంట్‌ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

వడమాలపేట (విజయపురం) : రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో శేషగిరి రావు ఆదేశించారు. వడమాలపేట మండలం, ఎస్‌వీపురం గంధపు దళితవాడలో జరుగుతున్న రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. నాణ్యమైన ఇసుక, సిమెంట్‌, స్టీలు వాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్‌ సెంటర్‌ తనిఖీ



ఆధార్‌ సెంటర్‌ పరిశీలిస్తున్న ఎంపీడీవో

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఏఎం పురంలో ఏర్పాటు చేసిన ఆధార్‌ సెంటర్‌ను ఎంపీడీవో శేషగిరిరావు మంగళవారం పరిశీలించారు. 0–6 ఏళ్ల లోపు పిల్లలందరూ ఆధార్‌ తీసుకోవాలని సూచించారు. రానున్న రెండు రోజుల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరికి ఆధార్‌ కార్డు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుష్టు నిర్మూలనే లక్ష్యం

పాలసముద్రం: కుష్టువ్యాధి నిర్మూలనే లక్ష్యమని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు. మంగళవారం తమ సిబ్బందితో కలసి కుష్టువ్యాధి నిర్ధారణకు ఇంటింటా సర్వే చేశారు. సూపర్‌వైజర్‌ సుశీల, మురళి, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు శ్రీబొమ్మరాజుపురం ఆది ఆంధ్రవాడలో ఇంటింటా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎవరికైనా స్పర్శలేని తెల్లని, నల్లని మచ్చలు ఉన్నాయో పరిశీలించి నమోదు చేశారు. గ్రామాల్లో కుష్టు నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఆకుల ధనమ్మ కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: స్థానికంగా రాస్‌ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో మంగళవారం మధ్యాహ్నం సర్పంచ్‌ ఆకుల మంగమ్మ, ఆకుల గోపి అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఆకుల గోపి మాట్లాడుతూ, ప్రతి ఏటా తన తల్లిదండ్రులు ఆకుల రంగయ్య శెట్టి, సతీమణి ఆకుల ధనమ్మ వర్ధంతి పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నందిని, రాజారాం యాదవ్‌, రంగయ్య, మురళి, వెంకటేష్‌, సురేష్‌, రవి, శివ, గిరి తదితరులు పాల్గొన్నారు.

లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామీజీ

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామంలో ఉన్న కామాక్షి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజ్యశ్రీ ప్రతాప్‌ స్వామి జీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నాడు పచ్చదనంతో ఉన్న పార్కు



నేడు పార్కులో కనుమరుగైన పచ్చదనం



నాడు కళకళ.. నేడు వెలవెల

- పార్కు నిర్వహణ గాలికి
- ఆలనా పాలనా కరువు
- పార్కులో సంచరిస్తున్న పశువులు

నగరి : పట్టణంలోని పార్కు అధికారుల నిర్లక్ష్యం వల్ల కునారిల్లుతోంది. ఫలితంగా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆహ్లాదం కోసం ఉద్యానవనానికి వెళితే కనీస వసతులు ఉండడం లేదని, పచ్చదనం కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరి కుశస్థలి నది సమీపం గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఆర్కేరోజా ప్రత్యేక చొరవతో డాక్టర్‌ వైఎస్సార్‌ తుడా పార్కును ఏర్పాటు చేశారు. రూ.80 లక్షల నిధులతో వాకింగ్‌కు మెడికేటెడ్‌ ట్రాక్‌, చిన్నారులు ఆడుకోవడానికి స్వింగ్‌ సీసా, ఊయలలు, మెర్రీ గో రౌండ్‌, బోట్‌ స్వింగ్‌ సీసా, స్లైడ్స్‌ అంటూ ఏర్పాటు చేసి పార్కును అందంగా తీర్చిదిద్దారు. పాలన మారడం, పర్యవేక్షణ కొరవడడంతో పార్కు పరిస్థితి దయనీయంగా మారింది.

దుర్భరంగా దర్శనమిస్తున్న వైనం

ఈ పార్కు ప్రస్తుతం కళావిహీనంగా మారింది. సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళ ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పశువులు లోపలకు వెళ్లి పార్కులోని పూల మొక్కలను తినేస్తున్నాయి. పచ్చిగడ్డికి నీరు పట్టే అవకాశం లేక అవన్నీ ఎండిపోతున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాచ్‌ మెన్‌ను ఏర్పాటు చేసి, పార్కును సుందరంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.





పార్కులో మొక్కలు తింటున్న ఆవులు

పశువులు పోకుండా చర్యలు చేపట్టాలి



పార్కులోకి పశువులు పోకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడానికి సిద్ధం చేసిన పార్కు వారిని భయపెట్టేదిగా ఉండకూడదు. పశువులు పార్కులోని మొక్కలను తినేస్తే అక్కడ ఆహ్లాదం ఏమీ ఉండదు. పార్కు అభివృద్ధికి అధికారులు చొరవ చూపాలి.

– ఎల్లప్పరెడ్డి, నగరి

చర్యలు తీసుకుంటాం



పార్కును పరిశీలించి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. అలాగే పశువులు పార్కులోకి వెళ్లకుండా పర్యవేక్షణ చర్యలు తీసుకుంటాం. పార్కుకు విచ్చేసే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

– కృష్ణారెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌, నగరి

పరిసరాల శుభ్రతకు తొలి ప్రాధాన్యం

–ట్రైనీ కలెక్టర్‌ హిమవంశీ



బృందావనం షెడ్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్‌ హిమవంశీ

గంగాధర నెల్లూరు: ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ట్రైనీ కలెక్టర్‌ కలెక్టర్‌ హిమవంశీ అన్నారు. మంగళవారం మండలంలోని ముక్కలతూరు, కడప గుంటను ఎంపీడీవో హరిప్రసాద్‌ రెడ్డితో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలన్నారు. సాలిడ్‌ వెల్త్‌ ప్రాసెసింగ్‌ సెంటర్లు వినియోగించుకోవాలన్నారు. బృందావనం షెడ్లను సక్రమంగా నిర్వహించాలని, కనీస వసతులు తాగునీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, వేర్వేరుగా సేకరించి కంపోస్టు ఎరువులు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ముక్కలత్తూరు, కడపగుంట పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌ కుమార్‌, మహేష్‌ కుమార్‌, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి..పరామర్శ

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ సుందరాంగిణిపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీకృష్ణ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. శ్రీకృష్ణ తండ్రి మణి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయరెడ్డి, నాయకులు రాజేంద్ర రెడ్డి, మోహన్‌ రెడ్డి, భాస్కర్‌, మణి తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

సంపద సృష్టి కేంద్రాలపై సమీక్ష



మాట్లాడుతున్న డీపీఓ సుధాకర్‌ రావు

గంగాధర నెల్లూరు: సంపద సృష్టి కేంద్రాలను (సాలిడ్‌ వెల్త్‌ ప్రాసెసింగ్‌ సెంటర్లు) వినియోగించుకుని పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని డీపీఓ సుధాకర్‌ రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్‌ అసిస్టెంట్లతో పారిశుద్ధ్యం, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణపై సమీక్షించారు. గ్రామాలలో తాగునీటి బోర్లు, కొళాయిలు, పబ్లిక్‌ ప్రదేశాలలో నీరు నిలువ లేకుండా పారిశుధ్యం మెరుగు పరచాలన్నారు. రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు, ముళ్ల పొదలను తొలగించాలని, నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్‌ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ హరి ప్రసాదరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముక్కలత్తూరులో పశు వైద్య శిబిరం



ముక్కలత్తూరులో పశువులను పరీక్షిస్తున్న డాక్టర్‌ నాగాంజనేయులు

గంగాధర నెల్లూరు: మండలంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య శాఖ ఏడీ మురళీమోహన్‌ కోరారు. ముక్కలత్తూరు, బాలగంగనపల్లె, పాత వెంకటాపురం, వేపంజేరిలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు . దూడలకు నట్టల నివారణ, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్‌ మురళీమోహన్‌, వెటర్నరీ డాక్టర్‌ నాగాంజనేయులు, పశు వైద్యాధికారి, ఎట్టేరి, సిబ్బంది నవీన్‌, నాగమ్మ, గణేష్‌ పాల్గొన్నారు .

కదలని మురుగునీరు



వడమాలపేట తిరుమణ్యం రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండల కేంద్రం తిరుమణ్యం రోడ్డుపై మురుగు నీరు ముందుకు కదలడం లేదు. రోడ్డుకు ఇరువైపులా కాలువ ఆక్రమణకు గురైంది. రోడ్డుపై వర్షపు నీరు అలాగే ఉండిపోవడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయని, రాత్రి పూట కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా రాకపోకలకు ఇబ్బంది మారిందని, అటుగా వెళ్లే ప్రతి ఒక్కరూ ముక్కు మూసుకొని వెళుతున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగునీటిని తొలగించి, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

క్రిష్ణజమ్మపురంలో భూముల రీ సర్వే



క్రిష్ణజమ్మపురంలో రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం పంచాయతీలో మంగళవారం భూముల రీసర్వేకు గ్రామాల్లో తహసీల్దార్‌ అరుణకుమారి, రీసర్వే డీటీ ప్రవీణ్‌కుమార్‌ రెండు బృందాలుగా సర్వే చేశారు. 30 ఎకరాలను రెండవ విడత రీసర్వే నిమిత్తం అధికారులు రైతుల భూముల వద్దకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. రైతులు భూ సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్‌ గణేష్‌, విలేజ్‌ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆధార్‌ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్‌ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి

పాలసముద్రం : మండలంలో నిర్వహిస్తున్న ఆధార్‌ కార్డు శిబిరాన్ని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి కోరారు. మంగళవారం సింహరాజుపురం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆధార్‌ శిబిరం నిర్వహించారు. విద్యార్థులు గతంలో ఆధార్‌ కార్డులో వయస్సు, పేర్లు తప్పులు ఉంటే వాటిని సవరించుకునేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్‌, డిజిటల్‌ అసిస్టెంట్‌ మోహన్‌, మహిళా పోలీస్‌ పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



ఎస్‌బీఆర్‌పురం అడ్డదారిలో కలపను తరలిస్తున్న ట్రాక్టర్‌

వడమాలపేట (విజయపురం): కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా చెట్లను నరికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో వేలాది ఎకరాల భూమి రిజర్వు ఫారెస్ట్‌గా ఉంది. దీంతోపాటు గ్రామాల్లోని పెద్ద పెద్ద వృక్షాలను కొందరు నరికివేస్తూ అక్రమ మార్గంలో ఫ్యాక్టరీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అరికట్టాల్సిన అటవీశాఖ అధికారులు కూడా వ్యాపారులతో లాలూచి పడి మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వందల ఏళ్ల నాటి వృక్షాలను నరికి ట్రాక్టర్లలో అడ్డదారిలో తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి వృక్ష సంపదను అన్యాక్రాంతం కాకుండా రక్షించడానికి చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రహదారి నిబంధనలను పాటించాలి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో

నగరి: రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని ఆర్‌టీవో వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నుంచి బైపాస్‌ కూడలి వరకు 150 మంది ఆటో, టాక్సీ డ్రైవర్లు, పోలీసులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిబంధనలను పాటించడం ద్వారా వాటిని నివారించవచ్చని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు నిర్లక్ష్యాన్ని విడనాడాలని హితవు పలికారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపేవారు ప్రయాణించే సమయాల్లో తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలోకి తెచ్చుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్‌ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్‌ చేయడం, హెల్మెట్‌ లేకుండా, సీట్‌ బెల్ట్‌ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం చేయరాదన్నారు. అలా చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి వాటిపై ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టామని, జరిమానాలు, శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్‌ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్లు, రవాణా, పోలీస్‌, శాఖల అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభం



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే థామస్‌

శ్రీరంగరాజపురం: ఉన్నత విద్యకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్‌ వీఎం థామస్‌ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో నూతన మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రీజినల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ నాగలింగారెడ్డి, పీవీకేఎన్‌ కళాశాల ప్రిన్సిపల్‌ జీవనజ్యోతి, తహసీల్దార్‌ లోకనాథపిళ్లై, ఎంఈఓలు అరుణాచలంరెడ్డి, సబర్మతి, ఎస్‌ఐ సుమన్‌, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రుక్మాంగదరావుకు జ్యోతిష్య సామ్రాట్‌ బిరుదు ప్రదానం



జ్యోతిష్య సామ్రాట్‌ బిరుదును అందుకుంటున్న పెనుమూరుకు చెందిన చింతా రుక్మాంగద రావు

పెనుమూరు(కార్వేటినగరం): ప్రముఖ తంత్ర జ్యోతిష్యులు చింతా రుక్మాంగదరావుకు జ్యోతిష్య సామ్రాట్‌ బిరుదు ప్రదానం చేశారు. అభిలాష హెల్పింగ్‌ హ్యాండ్స్‌ ఆర్గనైజేషన్‌ 5వ వార్షికోత్సవం, సావిత్రిబాయి పూలే 194వ జయంతి పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌ రవీంద్రభారతి ఆంధ్ర ప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ రంగాలకు చెందిన 60 మంది ప్రముఖులను వివిధ పురస్కారాలతో సత్కరించారు. పెనుమూరు మండలానికి చెందిన చింతా రుక్మాంగదరావును అక్కడి ప్రముఖుల చేత నిర్వాహకులు సన్మానించి, బిరుదు ప్రదానం చేశారు. జ్ఞాపిక, శాలువతో సత్కరించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: వరి, వేరుశనగ పంటలకు ఆశించే చీడపీడలను నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండలంలోని ఎలకాటూరు గ్రామాల్లో వేరుశనగ, వరి పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు. వేరుశనగ పంటలను ఆశించిన పచ్చపురుగు, లద్దిపురుగులను నివారణ చేపట్టాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పింఛన్‌ కోసం ప్రదక్షిణలు

- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్‌
- ఉన్న పింఛన్‌ తొలగించడానికి కుట్ర



వితంతు పింఛన్‌ కోసం ఎదురు చూస్తున్న తులసమ్మ

విజయపురం : రాష్ట్రంలో కూడమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా ఇంత వరకు కొత్త పింఛన్‌ ఇవ్వలేదు. పింఛన్‌ కోసం వృద్ధులు, వితంతువులు కార్యాలయాలా చుట్టూ తిరుగుతూ అలసిపోతున్నారు. అయినా ఇంత వరకు వెబ్‌సైట్‌ తెరుచుకోలేదు. ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు ఇంకా అనుమతించలేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని పేర్కొంటున్నారు. మండలంలో మొత్తం 25 పంచాయతీ, 12 సచివాలయం ఉండగా, ప్రతి రోజు పదుల సంఖ్యలో వృద్ధులు, వితంతులు, వికలాంగులు కొత్త పింఛన్‌ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వస్తున్నారు. అయితే ప్రభుత్వం నూతన పింఛన్‌ కోసం వెబ్‌సైట్‌ తెరవకపోవడంతో అర్హులైన వారు నిరాశతో తిరిగివెళ్లతున్నారు. కొత్త పింఛన్‌ ఎప్పుడు ఇస్తారో కూడా తెలియడం లేదని సచివాలయ సిబ్బంది సమాదానం చెబుతున్నారు.

ఉన్న పింఛన్లకు కత్తెర

కొత్త పింఛన్‌ దేవుడు ఎరుగు, ప్రస్తుతం వస్తున్న పింఛన్‌ను ఎలాగైన తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుట్రలు చేస్తున్నారు. అధికారం వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా 1వ తేదీన పింఛన్‌ ఇవ్వకుండా వైఎస్సార్‌ సీపీ మద్దతుదారులకు ఇబ్బందులు పెడుతున్నారు. మండల స్థాయి అధికారులను బెదిరించి, పింఛన్లను తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త పింఛన్‌ కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే, ఉన్న పింఛన్లను తొలగించడానికి అధికార పార్టీ నాయకులు ప్రయత్నం చేయడంపై ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. మరి కొత్త పింఛన్‌ సైట్‌ ఎప్పుడు ప్రారంభిస్తారో ఎవరికీ తెలియడం లేదు.

గత ప్రభుత్వంలో..

గతం వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వంలో పింఛన్‌, కొత్త రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేదని కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్‌ నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పింఛన్‌, రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే క్రమంతో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక అర్హులైన వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు.